# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 13 మార్చి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## రేపు మద్యం షాపులు బంద్




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రవ్యాప్తంగా మార్చి 14న మద్యం దుకాణాలు మూసివేయనున్నట్లు ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. శుక్రవారం హెూలీ పండుగ సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. 14వ తేదీ ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు వైన్ షాపులు బంద్ చేయనున్నారు. మద్యం సేవించిన బహిరంగ ప్రదేశాల్లో గొడవకు సృష్టిస్తే.. సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

హెూలీ సందర్భంగా పోలీసుల ఆంక్షలు విధించారు. రోడ్డు మీద వెళ్లేవారిపై రంగులు చల్లితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరికలు జారీచేశారు. రోడ్లపై గుంపులుగా ర్యాలీలు నిర్వహించొద్దని ఈ నిబంధనలు ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తప్పవని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి హెచ్చరించారు. 14న ఉదయం 6 నుంచి 15వ తేదీ ఉదయం 6 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.

## అబద్దాలతో రాష్ట్రాన్ని నడపం



- తెలంగాణ ఉద్యమంలో నిరుద్యోగుల పాత్ర చాలా క్రియాశీలకం
- 57,946 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం
- విద్యలో కేరళతో పోటీ పడాలి
- సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడంపై ఆలోచించాలి
- ప్రభుత్వానికి సహకరించకుంటే ఉద్యోగులకు జీతాలివ్వటం కష్టం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- 1,532 మంది అధ్యాపకులకు నియామకపత్రాలు అందజేత

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

"అబద్దాల ప్రాతిపదికన రాష్ట్రాన్ని నడపదలచుకోలేదు. కష్టమైనా, నష్టమైనా ప్రజలకు వివరించి, ప్రజల అనుమతి తీసుకుని రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేస్తాను" అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడంలో అందరం కలిసికట్టుగా ముందుకు నడుద్దామని పిలుపునిచ్చారు. ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్ కాలేజీల్లో లెక్చరర్లు, ఫ్యాకల్టీ ఉద్యోగాలకు ఎంపికైన 1532 మంది అభ్యర్థులకు రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన "ప్రజా ప్రభుత్వంలో కొలువుల పండుగ" కార్యక్రమంలో ముఖ్యమంత్రి నియామక పత్రాలు అందజేశారు. ఉద్యోగ పత్రాలు అందుకున్న అభ్యర్థులందరికీ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "విద్యార్థుల భవిష్యత్తుతో పాటు, తెలంగాణ పునర్నిర్మాణంలో అందరూ కంకణబద్ధులై పనిచేయాలి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో నిరుద్యోగుల పాత్ర చాలా క్రియాశీలకమైంది. గత ప్రభుత్వంలో నిరుద్యోగుల సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధి కనబరచలేదు. నియామకాలకు సంబంధించి న్యాయస్థానాల్లో కేసులు ఏళ్ల తరబడి వాయిదా పడుతుంటే ఒక్కొక్కటిగా చిక్కుముడులను విప్పుకుంటూ నియామకాలను పూర్తి చేశాం.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో 57,946 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. తెలంగాణ ఉద్యమానికి పునాదిగా నిలిచిన నిరుద్యోగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామన్న సంతృప్తి మాకుంది. ఒక్క ఏడాది కాలంలో ఇన్ని ఉద్యోగాలు భర్తీ చేసిన రాష్ట్రం దేశంలోనే మరొకటి లేదు. ఇది నాకు ఆత్మ సంతృప్తినిచ్చిన సందర్భం. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 55 రోజుల్లో డీఎస్సీ నిర్వహించి 11 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశాం. మీకు వచ్చిన ఉద్యోగం కుటుంబ భవిష్యత్తే కాదు, భవిష్యత్తు తరాలను కూడా తీర్చిదిద్దడానికి

మిగితా 2వ పేజీలో



# రేపటి తెలంగాణ మరింత ఉజ్వలమైంది

- అందరం సంఘటితంగా, విశ్వాసంతో, నిబద్ధతతో కలిసి ముందుకు సాగుదాం
- రూ.20,616.89 కోట్ల రూపాయలతో రైతులకు రూ.2 లక్షల లోపు రుణాలను మాఫీ
- తెలంగాణ అభివృద్ధికి సామాజిక న్యాయమే పునాది
- మహిళా సాధికారతే తెలంగాణ శక్తి
- న్యాయబద్ధ పురోగతి పొందడమే విజన్
- బడ్జెట్ భవిష్యత్‌కు రోడ్‌మ్యాప్
  ఉభయసభలనుద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అన్ని రంగాల్లో సమృద్ధిని సాధిస్తూ, పురోగతిలో దేశానికి చిక్కురిగా తెలంగాణను నిలబెట్టి నిర్మాణా నికి అందరం సంఘటితంగా, విశ్వాసంతో, నిబద్ధతతో కలిసి ముందుకు సాగుదామని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపుని చ్చారు. అవకాశాలకు నెలవుగా, అభివృద్ధి మార్గంలో సాధికారత కలిగిన రాష్ట్రంగా ఉన్న తెలంగాణ భవిష్యత్ మరింత ఉజ్వలమైందని చెప్పారు. ఆర్థికాభివృద్ధి, వ్యవసాయ పరిష్టి సాంకేతిక విజ్ఞానంలో ఆధునికత సామాజిక న్యాయం తదితర అంశాల్లో తెలంగాణ అగ్రగామిగా నిలవబోతోందని వ్యాఖ్యానించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా బుధవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు.

తెలంగాణ కలల సాకారానికి నిబద్ధత 2025-26వార్షిక బడ్జెట్ అని గవర్నర్ పేర్కొన్నారు. సమ్మిళతత్వం, స్వయం సమృద్ధి, సాధికారిక తెలంగాణ అనే విజన్ తో సాహసోపేత సంస్కరణలు. ప్రజాకేంద్రీకృత సుపరిపాలన, నిర్ణయాత్మక నాయకత్వంతో తెలంగాణ అభివృద్ధిలో ముందుకు సాగుతు న్నామన్నారు. తెలంగాణ గుర్తింపు, వారసత్వాన్ని గౌరవించేందుకు గద్దర్, గూడ అంజయ్య, బండి యాదగిరి వంటి వారిని గౌరవించుకున్నామన్నారు. రాష్ట్ర గేయంగా జయజయహే తెలంగాణ గీతాన్ని అధికారికంగా ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ విశిష్టతను చాటేలా తెలంగా తల్లి విగ్రహ అధికారిక ఆవిష్కరణ చేసుకున్నామన్నారు.

రాష్ట్రంలో రూ.20,616.89 కోట్ల రూపాయలతో రైతులకున్న రూ.2 లక్షల లోపు రుణాలను మాఫీ చేశామనీ, దీని ద్వారా ఇప్పటి వరకూ 25.35 లక్షల మంది లబ్ది పొందారని వివరించారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.12వేలు అందిస్తున్నామని గుర్తు చేశారు. తెలంగాణ నేడు 260లక్షల టన్నుల రికార్డు ధాన్య ఉత్పత్తితో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద వ్యవసాయ కార్మిక కుటుంబాలకు ఏడాదికి రూ.12వేలు అందిస్తున్నామని చెప్పారు. సన్నరకం ధాన్యం క్వింటాల్ కు రూ.500బోనస్ చొప్పున 1,206.44కోట్ల అందించామన్నారు. వ్యవసాయ రంగ ప్రగతిని కాంక్షిస్తూ వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. కృష్ణా జలాల వాట కోసం ట్రిబ్యునల్ వద్ద వాదనలు వినిపించామని గుర్తు చేశారు.

మహిళా సాధికారత సాధనలో ఇందిరా మహిళా శక్తి కమిషన్ పాలసీ ద్వారా లక్ష్య మంది మహిళా పారిశ్రామిక వేత్తల తయారీకి లక్ష కోట్ల సహాయం అందిస్తున్నామని వెల్లడించారు. మహాలక్ష్మి పథకం గేమ్ ఛేంజర్ గా ఉండి మహిళలకు 149.63కోట్ల ఉచిత బస్సు ట్రిప్పులను కల్పిస్తూ ప్ రూ.5005.95కోట్ల ప్రయాణ ఖర్చులను వారికి ఆదా చేశామని, ఈ చర్య వారి గమన శీలతనే కాకుండా స్వేచ్ఛ, గౌరవం, ఆర్థిక సాధికారితను చాటుతుందన్నారు.50లక్షల పేద కుటుంబాలకు గృహజ్యోతి పథకంతో 200యూనిట్ల ఉచిత విద్యుత్తు అందిస్తున్నామన్నారు. 43లక్షల కుటుబాలకు రూ.500గ్యాస్ సబ్సీడీ అందిస్తున్నామని..1000మెగావాట్ల సౌర విద్యుత్తు ప్లాంట్లను మహిళా సంఘాలకు కేటాయిస్తున్నామన్నారు.

యువజన సాధికారితకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేశామని వివరించారు. గత ఏడాది కాలంలో 55వేల ఉద్యోగాలు యువతకు ఇచ్చామని ప్రకటించారు. క్రీడల్లో అభివృద్ధికి యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్సిటీ బిల్లును ఆమోదించామన్నారు. తెలంగాణ విద్యావ్యవస్థ బలోపేతం కోసం విద్యాకమిషన్ ఏర్పాటు చేశారని.. డైట్ చార్జీలను 40శాతం, కాస్మోటిక్ చార్జీలను 200శాతం పెంచి మెనూ చార్జీలను పెంచి నాణ్యమైన భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. ఆమ్మ ఆదర్శ పాఠశాలలను ప్రారంభించి స్వయం సహాయక సంఘాలకు నిర్వాహణ బాధ్యతలు అప్పగించామని తెలిపారు. ఆరోగ్య తెలంగాణ సాధనకు ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.5లక్షల నుంచి 10లక్షలు పెంచామన్నారు. చికిత్స చేసే రోగాల సంఖ్యలో మరో 163 చికిత్సలను చేర్చామని వెల్లడించారు.

సామాజిక న్యాయం, సమాన అవకాశాల దిశగా విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లును ప్రతిపాదించామని గుర్తు చేశారు. జస్టిస్ షమీర్ అక్తర్ కమిషన్ సిఫారసుల ఆధారంగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లు తేబోతున్నామన్నారు. ఫిబ్రవరి 4న ఆ రెండు బిల్లులను ప్రతిపాదించి ఆరోజును తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవంగా ప్రకటించామని తెలిపారు. కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం, చేనేత కార్మికులకు తెలంగాణ చేనేత అభయ హస్తం పథకాలు అమలు చేస్తున్నామన్నారు. జౌళీ, మరమగ్గ రంగాల కార్మికుల అభ్యున్నతికి వేములవాడ వద్ద రూ.50కోట్ల యార్న్ డిపో ఏర్పాటు చేశామని వివరించారు. నేత కార్మిలకు సంక్షేమం కోసం స్వయం సహాయక మహిళలకు 64.70లక్షల మందికి ఏటా రెండు చీరలు ఇవ్వనున్నామన్నారు.

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి తెలంగాణ రైజింగ్ డెలిగేషన్ దావోస్ వేదికగా 49,500మంది ఉద్యోగాల కల్పించేలా రూ.1,778,950కోట్ల పెట్టుబడులను ప్రభుత్వం ఆకర్షించిందన్నారు. డాటా సెంటర్లు, హరిత ఇంధనం, ఆహార ప్రాసెసింగ్, ఎలక్ట్రికల్ వెహికల్స్, రక్షణ

మిగితా 2వ పేజీలో

## గవర్నర్ ప్రసంగం అబద్ధం



- కొత్త విషయాలేమీ లేవు..అన్నీ అబద్ధాలే..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రాష్ట్ర అసెంబ్లీలో చేసిన బడ్జెట్ ప్రసంగం అబద్ధమని, గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా గవర్నర్ ప్రసంగం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. గవర్నర్ ప్రసంగం అనంతరం శాసనసభ మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీలు ఈ ప్రభుత్వం, ఆరు గ్యారంటీల గురించి ఏమైనా కొత్త విషయాలు చెబుతారేమోనని అనుకున్నామన్నారు. కప్పిపుచ్చడానికి "కఠినమైన అబద్ధాలు, అర్ధ సత్యాలు మరియు తప్పుదారి పట్టించే ప్రకటనలతో" ప్రసంగాన్ని రూపొందించిందని ఆరోపించారు.

కొత్త విధానాలను వివరించడానికి లేదా కాంగ్రెస్ 420 ఎన్నికల వాగ్దానాలు మరియు ఆరు హామీల స్థితిని ప్రస్తావించడానికి బదులుగా, గవర్నర్ ప్రసంగం పార్టీ ప్రచారానికి మౌత్ పీస్‌గా పనిచేస్తున్నట్లు కనిపించడం పట్ల నిరాశ వ్యక్తం చేశారు. "ఆ ప్రసంగం వారి వినాశకరమైన పాలనను ఒప్పుకునేదిగా ఉంటుందని మేము భావించాము, కానీ అది గాంధీ భవన్‌లో జరిగిన ప్రెస్ మీట్ లాగా అనిపించింది" అని ఆయన అన్నారు. తెలంగాణ సచివాలయంలోని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చాంబర్ వెలుపల కాంట్రాక్టర్లు ఇటీవల నిర్వహించిన నిరసనను కెటిఆర్ ఎత్తి చూపారు. కాంట్రాక్టర్లు పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని డిమాండ్ చేస్తున్నారని, 20% కమిషన్ చెల్లించమని బలవంతం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. "భారతదేశంలోని ఏ రాష్ట్ర సచివాలయంలోనూ ఇది ఎప్పుడూ జరగలేదు" అని ఆయన వ్యాఖ్యానించారు, కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కంటే "కమిషన్లు మరియు అవినీతి"కి ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు.

రాష్ట్ర వ్యవసాయ సంక్షోభాన్ని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలే కారణమని కేటీఆర్ అన్నారు. తీవ్రమవుతున్న సాగునీటి సంక్షోభం కారణంగా పంటలు ఎండిపోతు న్నాయని, కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీని

మిగితా 2వ పేజీలో

## గవర్నర్ ప్రసంగంలో వాస్తవాలు లేవు

- బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



గవర్నర్ ప్రసంగం విజనరీ డాక్యుమెంట్‌గా ఉంటుందని ఆశించామనీ, ఆయన ప్రసంగంలో వాస్తవాలు లేవని.. అంతా డొల్ల అని బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. చేయని పనులు చేసినట్టు గవర్నర్ ప్రసంగం ఉందన్నారు. రైతు రుణ మాఫీ పూర్తిగా జరిగిందనేది అవాస్తవమన్నారు. ఏవీ ఇవ్వకున్నా, అన్ని ఇస్తున్నట్టు గవర్నర్ ప్రసంగం ఉందన్నారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ. 2,500, విద్యార్థినులకు స్కూటీలు ఇచ్చారా అని ప్రశ్నించారు. అబద్దాల పునాదుల మీద ప్రసంగం ఉందనీ, నిరుద్యోగ సాధికారిత అని మోసపూరిత మాటలు గవర్నర్ ప్రసంగంలో పొందుపరిచారన్నారు. బీఏసీలోనూ సమస్యలపై చర్చకు ఎక్కువ రోజులు అసెంబ్లీ నడవాలని అడిగాననీ, కేవలం ఐదు రోజుల్లో ప్రజా సమస్యలపై, బిల్లులపై చర్చ ఎలా జరుగుతుందని ప్రశ్నించినట్టు తెలిపారు.



## 25 లోగా కౌంటర్ దాఖలు చేయాలి

- ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో సుప్రీంకోర్టు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై మరోసారి జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్ సుప్రీం ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే, ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకోవాలంటూ ఇప్పటికే అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు నోటీసులు అందిన విషయం తెలిసిందే కదా. అదేవిధంగా అసెంబ్లీ సెక్రటరీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘంతో పాటు, పార్టీ మారిన 10 మంది బీఆర్ఎస్ రెబల్ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో తాజాగా పిటిషన్‌పై మరోసారి విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నోటీసులు అందుకున్న వారు ఈ నెల 25లోగా ఎట్టి పరిస్థితుల్లో కౌంటర్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.కాగా, బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీ లో చేరిన మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ.. జనవరి 15న బీఆర్ఎస్ సుప్రీం కోర్టును ఆశ్రయించింది.

## 19న రాష్ట్ర బడ్జెట్



- 27 వరకు అసెంబ్లీ సమావేశాలు
- 14, 16 తేదీల్లో సభకు సెలవు
- 17న ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధతపై చర్చ
- 18న బీసీ కులగణన, రిజర్వేషన్లపై చర్చ
- బీఏసీ సమావేశంలో నిర్ణయం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను 11 రోజులపాటు నిర్వహించాలని బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) నిర్ణయించింది. కనీసం 20 రోజులు నిర్వహించాలని ప్రతిపక్షాలు పట్టుపట్టాయి. అయితే 27న మరోసారి బీఏసీ సమావేశమై నిర్ణయం తీసుకుందామని అధికార పక్షం సూచించింది. అసెంబ్లీలో స్పీకర్ ఛాంబర్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈనెల 27 వరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. ఈనెల 19న బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. గురువారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టి.. దానిపై చర్చించి ఆమోదం తెలుపనున్నారు. 14న హెూలీ పండుగ నేపథ్యంలో సెలవు ప్రకటించారు. 16న ఆదివారం సెలవు ఉంటుంది. 17న ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధతపై చర్చించనున్నారు. 18న బీసీ కులగణన, రిజర్వేషన్లపై చర్చ జరుగనుంది. 19న బడ్జెట్‌ను శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. 21న బడ్జెట్‌పై చర్చించనున్నారు. అలాగే మూడు రోజుల పాటు పద్దులపై చర్చ జరుగనుంది. 27న ద్రవ్యవినిమయ బిల్లుకు ఆమోదం తెలుపుతారు. దాదాపు 11 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరుగనున్నాయి. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ నుంచి హరీష్ రావు, ప్రశాంత్ రెడ్డి, బిజెపి నుండి మహేశ్వర్ రెడ్డి, సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు, ఎంఐఎం నుంచి అక్బరుద్దీన్ ఓవైసీ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ సభ్యులు నిరసన చేస్తుంటే మీరేం చేస్తున్నారు..?



- ప్రభుత్వ విప్‌లపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం
- ఒక్కొక్కరు ఒక్కో విషయాన్ని ఎంపిక చేసుకోని మాట్లాడాలని సూచన

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గవర్నర్ ప్రసంగం తర్వాత బీఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తుంటే మీరేం చేస్తున్నారని ప్రభుత్వ విప్‌లపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం తర్వాత ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. సీఎం ఛాంబర్ లో జరిగిన ఈ భేటీలో సీఎం మాట్లాడుతూ "మనం లిక్కర్ పాలసీ తెచ్చుము.. వాళ్లు పాలసీ అనేదే లేకుండా వచ్చింది వెనక్కి వేసుకున్నారు. దీనిపై ఎందుకు మాట్లాడలేకపోతున్నారు" అని ప్రశ్నించారు సీఎం రేవంత్. ప్రభుత్వ విప్ లు పని తీరు మార్చుకోవాలని, కేటాయించిన సభ్యులు అన్ని విషయాల పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ విప్ లు అందరూ అన్ని విషయాలు మాట్లాడాలని అనుకోవద్దని, ఒక్కొక్కరు

మిగితా 2వ పేజీలో

## అసెంబ్లీకి హాజరైన కేసీఆర్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర బడ్జెట్ సమావేశాల తొలి రోజున బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి హాజరయ్యారు. హైదరాబాద్లోని నం దినగర్ నివాసం నుంచి అసెంబ్లీకి చే రుకున్న కేసీఆర్‌కు అసెంబ్లీ ప్రాంగణం దగ్గర బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అనంతరం బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ భేటీ అయ్యారు.. అసెంబ్లీ, మండలిలో అనుసరించా ల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని పార్టీ ప్రతినిధులకు సూచించారు కొంతకాలంగా అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ దూరంగా ఉం టున్నారు. బుధవారం మాత్రం సెషన్ ప్రారంభానికి గంట ముందే.. అంటే ఉదయం 10 గంటలకే అసెంబ్లీకి రావడం గమనార్హం. ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్.. చివరి బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీకి హా జరయ్యారు. ఆ తర్వాత మళ్లీ అసెంబ్లీకి రాలేదు. మళ్లీ ఈ అసెంబ్లీ సమావేశాల కు హాజరవుతున్నారు.

# పంటను కాపాడడం రాష్ట్ర ప్రభుత్వ కర్తవ్యం



- **రాష్ట్ర నీటిపారుదల, పౌర సర ఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పంటను కాపాడడం రాష్ట్ర ప్రభుత్వ కర్త వ్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సర ఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సాగునీటి విషయంలో అసత్య ప్రచారాలు ఎక్కువ అవుతున్నా యని, ఈ విషయంలో నీటిపారుదల శాఖాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ వాస్తవాలను ప్రజలకు సోదాహరణంగా వివరించాలని అధికారులను ఆదేశించా రు. సోమవారం సచివాలయం నుంచి సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘు నందన్ రావు టీఎస్ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ తదితరులతో కలసి రాష్ట్రంలోని కలెక్టర్లు, ఎస్పీలు, వ్యవసాయ, విద్యుత్ శాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. రబీ సీజన్ పంట మరో 15 రోజుల్లో చేతికి రానున్న నేపథ్యంలో ఆయా జిల్లాల అధికారులు సమన్వయంతో కలసి క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ రైతం గానికి తోడ్పాటు సందించాలని ఆయన సూచించారు.

**విద్యుత్ సరఫరాలో అవాంతరాలు లేవు..**

యాసంగి పంటకు సాగు నీరు చివరి కంటూ అందించేందుకు నీటిపారుదల శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో ఇప్పటి వరకు ఎటువంటి అవంతరాలు లేవని ఉత్తమ్ ప్రకటించారు. కాలువల నీటి సరఫరా అంశంలో ఎప్పటికప్పుడు విద్యుత్ శాఖాధికారుల సహకారాన్ని తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాకా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లా డుతూ క్షేత్ర స్థాయిలో నిజానిజాలు తెలుసుకో కుండా పంట నష్టం గురించి జరుగుతున్న ప్రచారం సత్య దూరమ న్నా రు. బోర్లు ఎండిపోవడమో, మోటార్లు కాలి పోవడం తదితర పరిణామాలతో పంట నష్టం జరుగుతుందంటూ జరుగు తున్న అసత్య ప్రచారాన్ని రాజకీయంగా వినియోగిం చుకునేందుకు కొన్ని శక్తులు రంగంలోకి దిగాయన్నారు. కటువంటి విషయంలో అధికారులు తక్షణమే రంగంలోకి దిగినివారణ చర్యలు చేపట్టా లన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాం తికుమారి మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశానుసారం రబీ పంట విషయంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూనే వీడియో కాన్ఫరెన్స్ ల ద్వారా సమగ్ర సమాచారం తెప్పిస్తున్నామ న్నారు. అందులో భాగంగానే నీటి పారుదల శాఖతో సమన్వయం చేసుకుని అన్నపూర్ణ సాగర్ నుంచి రంగనాయక సాగర్ కు 1.5 టీఎంసీ నీటిని విడుదల చేయడంతో పాటు పంప్ హౌస్ల మరమ్మతులు చేపట్టినట్లు ఆమె వివరించారు.

# అబద్ధాలతో రాష్ట్రాన్ని నడపం

(మొదటి పేజీ తరువాయి)

ఉపయోగపడాలి. దేశ భవిష్యత్తు విద్యా శాఖతో ముడిపడి ఉంది. విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉంది. విద్యా శాఖకు కేటాయించే నిధులు ఖర్చు కాదు. భవిష్యత్ తరాలకు పెట్టుబడి.

విద్యలో కేరళతో పోటీ పడి రాణించాల్సిన తెలంగాణ ఈరోజు కింది నుంచి రెండో మూడో స్థానంలోకి పడిపోయిందంటే తెలంగాణ జాతికి అవమానం. వాస్తవాలను అంచనా వేసుకుని, వాస్తవాల మీద చర్చించుకుని భవిష్యత్తుకు ప్రణాళికలను తయారు చేసుకున్నప్పుడే తెలంగాణలో విద్యా ప్రమాణాలను పెంచుకోవడానికి దోహదపడుతుంది.ప్రభుత్వ రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ స్కూళ్లల్లో అత్యుత్తమ ప్రమాణాలు, అనుభవం కలిగిన అధ్యాపకులు ఉన్నప్పటికీ అంతగా అనుభవం లేని ప్రైవేటు స్కూళ్లల్లో ఎక్కువ మంది పిల్లలు ఎందుకు చదువుతున్నారు. ప్రైవేటు స్కూళ్లతో ఎందుకు పోటీ పడలేకపోతున్నామో ఒక్కసారి ఆలోచించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య ప్రతి ఏటా తగ్గుతోంది. విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయి. ఇది ఆందోళన కలిగించే పరిణామం. ఇంత ఖర్చు పెడుతున్నా ఫలితాలు సాధించలేకపోతే వృధా. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలి. చర్చించుకోవలసిన అవసరం ఉంది. లోపాలను సరిదిద్దుకోవలసిన అవసరం ఉంది.

అందుకే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఇంటిగ్రేడెటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను నిర్మిస్తున్నాం. అందుకోసం 11 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయబోతున్నాం. ప్రతి ఏటా లక్షలాది మంది ఇంజనీరింగ్ ఉత్తీర్ణులవుతున్నా, స్కిల్స్ లేని కారణంగా వారిలో 10 శాతం మందికి కూడా ఉద్యోగాలు రావడం లేదు. వీటన్నంటిని గమనించే తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి శ్రీకారం చుట్టాం. క్రీడలు దేశ ప్రతిష్టను పెంచుతాయి. దేశంలో ఇంత జనాభా ఉన్నప్పటికీ క్రీడల్లో రాణించలేకపోతున్నాం. కోట్లాది ప్రజలున్నా ఒలింపిక్స్ లో ఒక్క గోల్డ్ మెడల్ కూడా సాధించలేకపోతున్నాం. విద్యతో పాటు క్రీడలను కూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఉద్యోగాల్లో చేరిన తర్వాత స్కూళ్లు, కాలేజీల్లో మట్టిలో మాణిక్యాలను వెలికితీసి క్రీడాకారులను తయారు చేయాలి. ప్రభుత్వ పరంగా కూడా కొన్ని సమస్యలు ఉన్నాయి. ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ముందుకు పోవాలి” అని ముఖ్యమంత్రి గారు వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గారు, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు గారు, పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రేపటి తెలంగాణ మరింత ఉజ్వలమైంది

(మొదటి పేజీ తరువాయి)

రంగ తయారీ వంటి రంగాలలో పెట్టుబడులను సాధించామన్నారు. కొత్త ఎంఎస్ఎంఈ పాలసీని రూపొందిస్తున్నామని, తెలంగాణను ఏఐ,డేటా క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా సుస్థిర స్థానంలో నిలబెడుతుం న్నామని చెప్పారు.తెంగాణ టూరిజం అభివృద్ధికి నూతన పర్యాటక అభివృద్ధి పాలసీ రూపొందిం చామని గుర్తు చేశారు. తెలంగాణ 2025 స్వచ్ఛ, హరిత ఇందన పాలసీనీ రూపొందిం చామని, 2030నాటికి రాష్ట్రంలో 600విద్యుత్తు చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తామన్నారు. గ్రీన్ ఎనర్జీలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతామని చెప్పారు.

భూపరిపాలన బలోపేతం కోసం భూభారతి చట్టాన్ని ప్రవేశ పెట్టి అధునిక, సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ మ్యాపింగ్ ద్వారా భూమి హక్కుల రక్షణను పటిష్టం చేశామని తెలిపారు. భూసంస్కరణలతో పాటు గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తున్నామన్నారు. శాంతిభద్రతల పటిష్టత దిశగా ప్రపంచ స్థాయి విద్యా సంస్థ యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ కు శంకుస్థాపన చేశామని పేర్కొన్నారు. తెలంగాణ విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్) ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. తెలంగాణ భవిష్యత్తు విజన్ లో భాగంగా మెట్రో రైలు విస్తరణ, మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు, ఫ్యూచర్ సిటీ ఏర్పాటు ప్రాజెక్టులను చేపట్టామని తెలిపారు. ప్రపంచ స్థాయి నగరంగా ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకోబోతుందన్నారు. తెలంగాణ బడ్జెట్ కేవలం అంకెల కూర్పు కాదని..భవిష్యత్తు కోసం ప్రభుత్వ ప్రాధాన్యతలకు, విజన్ కు ప్రతిబింబమని స్పష్టం చేశారు.

నేటి తెలంగాణ అవకాశాలు అభివృద్ధి, సాధికారిత గల రాష్ట్రంగా ఉంటే..రేపటి తెలంగాణ మరింత ఉజ్వలమైందని, ఆర్థిక అభివృద్ధి, వ్యవసాయ పరిపుష్టి, సాంకేతిక విజ్ఞాన వినూత్నత, సామాజిక న్యాయం, మానవ ప్రాభావానికి అగ్రగామి రాష్ట్రంగా మారుతుందని గవర్నర్ ఆకాంక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి డైనమిక్ నాయకత్వంలో సమృద్ధి, సమానత్వం, పురోగతిలో దేశానికి దిక్సూచి అయ్యే తెలంగాణ నిర్మాణానికి సంఘటితంగా, విశ్వాసంతో, స్థిరమైన నిబద్ధతతో అంతా ముందడుగు వేద్దామని గవర్నర్ పిలుపునిచ్చారు.

# గవర్నర్ ప్రసంగం అబద్ధం

(మొదటి పేజీ తరువాయి)

మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు (కెసిఆర్) పట్ల రేవంత్ రెడ్డికి ఉన్న ద్వేషం కారణంగా 15 నెలలుగా మరమ్మతులు చేయకుండా వదిలేశారని ఆయన పేర్కొన్నారు. “వేల ఎకరాల పంటలు నాశనమయ్యాయి, రైతులు పశువులను మేపడానికి తమ పొలాలను ఉపయోగించుకోవాల్సి వచ్చింది” అని ఆయన అన్నారు, గవర్నర్ ప్రసంగం ఈ ముఖ్యమైన సమస్యలను ఎందుకు విస్మరించిందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడా రుణమాఫీలు 25–30% మించలేదని నొక్కి చెబుతూ, వ్యవసాయ రుణమాఫీల గురించి ప్రభుత్వ వాదనలను ఆయన మరింత సవాలు చేశారు. “100% రుణమాఫీలు అమలు చేయబడిన ఒక గ్రామాన్ని నాకు చూపించు, బీఆర్ఎస్ నాయకులు రాజీనామా చేస్తారు” అని కేటీఆర్ అన్నారు. రుణమాఫీలు పూర్తయ్యాయని, “లక్షలాది మంది రైతులు సంతోషంగా ఉన్నారని” గవర్నర్ తప్పుగా చెబుతున్నారని ఆరోపించారు. అదనంగా, “రైతు బంధు” పథకం, కార్మికులకు ?12,000 వార్షిక ప్రయోజనం అమలు చేయబడుతున్నాయనే వాదనలను ఆయన తోసిపుచ్చారు, వాటిని మరింత వక్రీకరణలుగా ముద్ర వేశారు.

దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదికలో రూ.1.79 లక్షల కోట్ల పెట్టుబడులను పొందామని ప్రభుత్వం చేసిన వాదనను కూడా ఆయన తోసిపుచ్చారు, ఇది “పూర్తి అబద్ధం” అని అన్నారు. గత సంవత్సరం ప్రకటించిన ?40,000 కోట్ల పెట్టుబడులు ఇంకా కార్యరూపం దాల్చలేదని, వాస్తవ పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలని అన్నారు. విదేశీ స్కాలర్‌షిప్‌లు ఇవ్వకుండా, గురుకుల పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తూ కాంగ్రెస్ పార్టీ విద్యార్థులను నిరాశపరిచిందని, అక్కడ విద్యార్థులు “ఆకలితో అలమటిస్తున్నారని”, 83 మంది మరణించారని ఆయన అన్నారు. “గవర్నర్ ప్రసంగంలో ఒక్క సంతాప మాట కూడా ప్రస్తావించలేదు” అని ఆయన విచారం వ్యక్తం చేశారు. కుల గణన హామీలను నెరవేర్చకుండా వెనుకబడిన తరగతుల (బిసి) సమాజాన్ని మోసం చేసిందని, రిజర్వేషన్ల గురించి ఆందోళన వ్యక్తం చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీని సస్పెండ్ చేసిందని కూడా ఆయన విమర్శించారు. తన ముగింపు వ్యాఖ్యలలో, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను “మోసం” చేయడం, అప్పుల్లో, అవినీతిలో మునిగిపోవడాన్ని తెలంగాణ ప్రజలు గ్రహించడం ప్రారంభించారని కెటిఆర్ హెచ్చరించారు. “గవర్నర్ ప్రసంగం వైఫల్యాలను కప్పిపుచ్చే ప్రయత్నం” అని ఆయన అన్నారు, సమయం వచ్చినప్పుడు బలమైన ప్రజా వ్యతిరేకత వస్తుందని అన్నారు.

## బీఆర్ఎస్ సభ్యులు నిరసన చేస్తుంటే మీరేం చేస్తున్నారు..?

(మొదటి పేజీ తరువాయి)

గవర్నర్ ప్రసంగం తర్వాత బీఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తుంటే మీరేం చేస్తున్నారని ప్రభుత్వ విప్‌లపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం తర్వాత ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. సీఎం ఛాంబర్ లో జరిగిన ఈ భేటీలో సీఎం మాట్లాడుతూ “మనం లిక్కర్ పాలసీ తెచ్చము.. వాళ్లు పాలసీ అనేదే లేకుండా వచ్చింది వెనక్కి వేసుకున్నారు. దీనిపై ఎందుకు మాట్లాడలేకపోతున్నారు” అని ప్రశ్నించారు సీఎం రేవంత్. ప్రభుత్వ విప్ లు పని తీరు మార్చుకోవాలని, కేటాయించిన సభ్యులు అన్ని విషయాల పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ విప్ లు అందరూ అన్ని విషయాలు మాట్లాడాలని అనుకోవద్దని, ఒక్కొక్కరు ఒక్కో విషయాన్ని ఎంపిక చేసుకోవాల్సిందిగా సూచించారు. ఫ్లోర్ కో ఆర్డినేషన్ పకడ్బందీగా చేయాలని ఎంఎల్ఏలతో సీఎం రేవంత్ అన్నారు.

## హైకోర్టులో కేటీఆర్‌కు ఊరట

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిర్వహించిన ప్రచార ర్యాలీలో భాగంగా బాణాసంచా కాల్చి ప్రజలకు ఇబ్బంది కలిగించారని కెటిఆర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ పై ముషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టి వేయాలని బిఆర్ఎస్ నేతలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై బుధవారం విచారణ జరిపిన న్యాయస్థానం కేసును కొట్టివేసింది.

## నియోజకవర్గాల పునర్విభజనపై అఖిలపక్ష సమావేశం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయం ప్రకారం నియోజకవర్గాల పునర్విభజనపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం పార్టీలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి బహిరంగ లేఖ రాశారు. జనాభా ప్రాతిపదికన జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనతో రాష్ట్రానికి ప్రమాదం పొంచి ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. జరగబోయే నష్టం గురించి అన్ని పార్టీలను ఆహ్వానించి చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశానికి అన్ని పార్టీలూ హాజరు కావాలని ఆ లేఖలో కోరారు. ప్రతి పార్టీని ప్రత్యేకంగా ఆహ్వానిస్తామని తెలిపారు. త్వరలోనే తేదీ, వేదిక ప్రకటిస్తామని వారు స్పష్టం చేశారు.

## శ్రీశైలంలో కామదహనం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**




ఫాల్గుణ శుద్ధ చతుర్దశిని పురస్కరించుకుని శ్రీశైలంలో బుధవారం సాయంత్రం 6.30 గంటలకు ఆలయ ముందుభాగంలోని గంగాధర మండపం వద్ద కామదహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందు ఆలయంలో శ్రీస్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో మనోహర గుండం ఎదురుగా వేంచేబు చేయించి విశేషపూజలను నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ నిర్వహించబడింది. ఈ పల్లకీసేవలోనే ఉత్సవమూర్తులు గంగాధర మండపం వరకు తోడ్కొని వచ్చి శాస్త్రోక్తంగా పూజదికాలు జరిపించిన తరువాత సాంప్రదాయాన్ని అనుసరించి మన్మథ రూపాన్ని దహనం చేయడం జరిగింది. కాగా మన్మథుడు శివతపోభంగం చేయగా, కోపించిన పరమేశ్వరుడు మన్మథుడిని ఫాల్గుణ శుద్ధ చతుర్దశి రోజే దహించాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ కారణంగానే కామదహనాన్ని నిర్వహించడం సాంప్రదాయమైనది. కామదహన కార్యక్రమాన్ని వీక్షించడం వలన శివకటాక్షం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి.

## రైతు బిడ్డ.. నాలుగు ఉద్యోగాలు సాధించిండు..

**- ప్రభుత్వ ఉద్యోగ కలను సాకారం చేసుకున్న యువకుడు..**

**- నాలుగు ఉద్యోగాలు సాధించి యువతకు స్ఫూర్తిగా నిలిచిన మెతుకు సంతోష్..**

**- గ్రూప్- 1 లక్ష్యంగా ముందుకు**



**బలగం టీవీ , సిరిసిల్ల**

శ్రమ నీ ఆయుధం అయితే విజయం నీ భానిస ఆవుతుంది అన్న సూక్తిని గుర్తుపెట్టు కుంటూ తను చదువుకున్న చదువుకు ఓ గుర్తింపు ఉండాలని, కన్నవారు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా సర్కారు నౌకరి లక్ష్యంగా, ఎన్నెన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్న నౌకరి సాధించేవరకు విశ్రమించేది లేదని పట్టుబట్టి ఒకటి కాదు, రెండు కాదు, ఏకంగా నాలుగు ప్రభుత్వ కొలువులు సాధించి ఔరా అనిపించాడు రైతు బిడ్డ మెతుకు సంతోష్..

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన మెతుకు కళావతి రాములు ది సాధారణ వ్యవసాయ కుటుంబం. వీరికి ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు మెతుకు సంతోష్ మంగళవారం టీజీ పీఎస్సీ విడుదల చేసిన గ్రూప్ 2 ఫలితాల్లో 235 ర్యాంక్ సాధించాడు.

**సర్కారీ కొలువులపైనే గురి :**

మల్లారెడ్డిపేటలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పూర్తి సంతోష్, ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల జూనియర్ కాలేజీలో ఇంటర్, గాయత్రి డిగ్రీ కాలేజీలో డిగ్రీ, ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ పూర్తి చేశాడు.

చిన్నప్పటి నుండి ప్రభుత్వ కొలువు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్న సంతోష్ , పీజీ తర్వాత తర్వాత సర్కారీ కొలువులపైనే గురి పెట్టాడు..

**మొక్కవోని దీక్షతో సాధన :**

పీజీ తర్వాత పోటీ పరీక్షలకు సన్నద్ధమవ్వాలని నిర్ణయించుకున్న సంతోష్ పోటీ పరీక్షలకు శిక్షణ నిచ్చే సంస్థలో చేరి, అక్కడి నుంచి విరామం లేకుండా పట్టుదలతో చదివాడు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న సమయంలో అనేక ఒడిదుడుకులు, సమస్యలు వచ్చినప్పటికీ మొక్కవోని దీక్షతో ముందుకు సాగాడు. ప్రభుత్వ ఉద్యోగ వేటలో నిమగ్నమైన సంతోష్ ,ఒకటి రెండు కాదు ఏకంగా వరుసగా నాలుగు ప్రభుత్వ కొలువులు సాధించి ఔరా అనిపించాడు. వరుసగా సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్ గా, ఎక్సైజ్ కానిస్టేబుల్, గ్రూప్ 4 లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు సాధించాడు. సింగరేణి లో జూనియర్ అసిస్టెంట్గా విధులు నిర్వహించి సమయంలో గ్రూప్ 4 ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం రావడంతో, సింగరేణి జూనియర్ అసిస్టెంట్కు రిజైన్ చేసి, సిరిసిల్లలోని ట్రెజరీ డిపార్ట్మెంట్లో జూనియర్ అసిస్టెంట్ గా చేరి, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం విడుదలైన గ్రూప్ 2 ఉద్యోగ నియామకాల్లో రాష్ట్రస్థాయి 235 ర్యాంకుతో గ్రూప్ 2 ఉద్యోగానికి ఎంపికయ్యాడు.ఏకంగా నాలుగు ఉద్యోగాలు సాధించడంతో పలువురుకి మెతకు సంతోష్ ఆదర్శంగా నిలిచాడు.

## వేములవాడ ఏరియా ఆసుపత్రి మరో రికార్డ్

- **24 గంటల్లో 19 ఆపరేషన్లు**
- **అన్ని రకాల స్పెషలిస్టుల సేవలు అందుబాటులో**
- **ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య**



**బలగం టీవీ , వేములవాడ**

వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ఇప్పటికే పలు రివార్డులను సొంతం చేసుకున్న వేములవాడ ఏరియా ఆసుపత్రి మరో రికార్డును తన ఖాతాలో వేసుకుంది.గత 24 గంటలలో ఆసుపత్రిలో వివిధ రకాల 19 ఆపరేషన్లు చేసి వైద్యులు చెత్తా చాటారు. ఈ క్రమంలో 24 గంటల్లో 19 ఆపరేషన్ లో 11 మంది గర్భిణీలు డెలివరీలు అయ్యారు. ఇందు లో ఆరుగురు ఆపరేషన్లు, ఐదుగురు సాధారణ కాన్పులు,ఇద్దరికీ గర్భసంచి, ముగ్గురికి కంటి ఆపరేషన్లు, నలుగురికి జనరల్ సర్జరీలు ఉన్నాయి.

**అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో...**

వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో అన్ని రకాల స్పెషలిస్టుల సేవలు అందుబాటులో ఉన్నాయని రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు ఇట్టి అవకాశాలను సద్వినియోగ పర్చుకోవాలని ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ పెంచలయ్య అన్నారు . ఈ సందర్భంగాడాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ

ఆసుపత్రిలో రేడియాలజీ విభాగంలో ఎక్రేలు, స్కానింగ్, ఈసీజీ చేస్తున్నామని,అన్ని రకాల రక్త పరీక్షలు జరుగుతున్నాయని అన్నారు.చిన్నపిల్లల విభాగానికి సంబంధించిన ముగ్గురు స్పెషలిస్ట్ వైద్యులు,గైనకాలజీ భాగంలో ముగ్గురు మెడికల్ కాలేజీకి సంబంధించిన ప్రొఫెసర్లు తమ సేవలను అందిస్తున్నారని అన్నారు.జనరల్ సర్జరీలో ఇద్దరు వైద్యులు ఆపరేషన్లు 24 గంటలు చేస్తున్నారని,ఆర్థోపెడిక్ డాక్టర్ అనిల్ 24 గంటలు అందుబాటులో ఉండి అన్ని రకాల ఆపరేషన్లు,మోకాలి మార్పిడి ఆపరేషన్లు అవసరమైన వాళ్ళు డాక్టర్ అనిల్ ని సంప్రదించగలరని అన్నారు.జనరల్ ఫిజీషియన్ విభాగంలో ఇద్దరు డాక్టర్లు,కంటి విభాగంలో డాక్టర్ రత్నమాల, రేడియాలజీ విభాగంలో సీనియర్ వైద్యులు డాక్టర్ రవీందర్ అవసరమైన రోగులకి స్కానింగ్ చేయుచున్నారని,వేములవాడ పరిసర ప్రాంత ప్రజలు ఎటువంటి మన ఆరోగ్యం గురైన వైద్య సేవలు ఉచితంగా పొందాలని, ఆస్పత్రిలో రోగులకి ఎటువంటి అసౌకర్యం కలిగిన సూపరిండెంట్నీ సంప్రదించి తమ సమస్యలు పరిష్కరించుకోగలరని తెలిపారు.

## 'గుడి నిర్మాణానికి నంది కిషన్‌కు బిర్లా.. రంగలు.. సహకరించాలి'



**బలగం టివి, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీరుక్మిణి సత్యాభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ పునర్నిర్మానాన్ని చేపడుతామని ముందుకు వచ్చిన నంది కిషన్‌కు బిర్లా..... రంగా.......లు ప్రభుత్వం నుంచి నిధులు తెస్తామని, తామే గుడి నిర్మాణం చేపడతామని హంగులు ఆర్భాటాలతో భూమి పూజ చేసి రెండు సంవత్సరాలు కావస్తున్నదని పలువురు గ్రామస్తులు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట ప్రజలను తప్పుదోవ పట్టించి కల్లబొల్లి మాటలు పలికి పురాతన ఆలయాన్ని కూల్చివేసి అందులో ఉన్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి విగ్రహాలను శివాలయం పక్కన ఉన్న ఆలయంలోకి మార్చి రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహించారు. నంది కిషన్, బొమ్మ కంటి రవీందర్ గుప్తా తనతోపాటు మరికొంతమంది 5 లక్షల రూపాయలతో గుడిలో చిట్టి స్టార్ట్ చేసి నేడు 23 లక్షల వరకు గుడికి జమచేసినట్టు తెలిపారు. రాగుల వెంకటరెడ్డి సుగుణ, తమ్మనపల్లి సుధాకర్ రాజేశ్వరి,చందనం చిన్న భాస్కర్ లక్ష్మిలు ఆలయ నిర్మాణం కోసం ఆలయానికి ఎదురుగా ఉన్న వారి సొంత ఇండ్లను విక్రయించినందుకు అభినందనీయమని గుర్తు చేశారు. అడగగానే వారి ఇండ్లను ఆలయానికి ఇచ్చారని, వారికి ప్రభుత్వం నుంచి ఇండ్లను మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని అన్నారు. అలాగే త్వరలో 50 లక్షల రూపాయల తో నిర్మాణాన్ని ప్రారంభిస్తామని నంది కిషన్ అన్నారు. అనంతరం అలయానికి వెళ్లే 9 ఫీట్ల రోడ్డును 30 ఫీట్లు సీసీ రోడ్డుకు సహకరించిన బిజెపి నాయకులు చందుపట్ల లక్ష్మారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.గుడి పైన రాజకీయాలు చేయొద్దని,గుడి నిర్మాణాన్ని అడ్డుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

బిజెపి నాయకులు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ...... చిట్టి సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఎల్లారెడ్డిపేటకు చెందిన బిర్లా... రంగాలు...... వ్యక్తిగత కక్షలతో ముందుకు సాగనివ్వకుండ చేస్తున్నారని సంధిపట్ల లక్ష్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.రానున్న రోజులలో గ్రామంలో ప్రజలు మిమ్ములను వ్యతిరేకించ కంటే ముందే ఇప్పటికైనా నందికిషన్ కు సహకరించాలని బిర్లా....... రంగలలు కులాల మధ్య రెండు కమిటీలు వేసి చిచ్చు పెట్టి వల్లకాడు చేయొద్దని తాము మనవి చేస్తున్నామన్నారు.అందరి సహకారంతో గుడి నిర్మాణానికి ముందుకు సాగుతుందని, ఎవరెవరు ఏమి చేస్తున్నారు ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యాల ప్రభాకర్ రెడ్డి,చందుపట్ల లక్ష్మారెడ్డి, బొమ్మ కంటి రవీందర్,సనుగుల ఈశ్వర్,మీసం రాజం,ప్రభాకర్ రెడ్డి,మేగి నరసయ్య,నర్సింలు సింగిల్ విండో అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, పారిపెల్లి రామ్ రెడ్డి,ఆలయ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే..

**-బీఆర్ఎస్ కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలి..**

**-చల్మెడ లక్ష్మీ నరసింహ రావు..**



**బలగం టీవీ , వేములవాడ**

గత పదేళ్ళలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, గత 15నెలల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేసిన అభివృధి పనులను తెలపాలని బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీ నరసింహ రావు కాంగ్రెస్ నాయకులకు సవాలు విసిరారు. బుధవారం వేములవాడ పట్టణంలోని లక్ష్మీ నరసింహారావు నివాసంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సాయంతో నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, వాటి ప్రస్తుత పరిస్థితిని క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీ నరసింహ రావు మాట్లాడుతూ గత 50ఏండ్ల కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో చరిత్రలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి కాలేదని, 2014 తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై బిఆర్ఎస్ పార్టీ అధికారం చేపట్టాక కేసీఆర్ నాయకత్వంలో జిల్లాలోని అప్పర్ మానేర్, మిడ్ మానేర్, లోయర్ మానర్ లను పునరుద్ధరించి ఒక్కొక్క ప్రాజెక్టు కింద లక్ష ఎకరాలకి సాగునీరు అందించేందుకు కృషి చేసినారని అన్నారు.. జిల్లాలోని 40కిలోమీటర్ల మానేర్, 27కిలో మీటర్ల మూలవాగులపై 24చెక్ డ్యాంలు కట్టి,కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. 2006లో ప్రారంభమైన మిడ్ మానేర్ ను కాంగ్రెస్ పార్టీ పెండింగ్ లో పెడితే కేసీఆర్ నాయకత్వంలో రూ. 1500కోట్ల పైచిలుకు నిధులతో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి సాగునీరు అందించిన ఘనత కేసీఆర్ కే దక్కిందని అన్నారు. తమపై అసత్య ప్రచారాలు మానుకొని నియోజకవర్గంలోని ప్రధాన సాగునీటి రంగంలోని కలికోట సూరమ్మ చెరువు, మల్కపేట రిజర్వాయర్, అప్పర్ మానేర్ ల పెండింగ్ పనుల్ని పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని, రాజన్న ఆలయ అభివృద్ధి చేయాలని, మిడ్ మానేర్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని, మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ లను కోరారు . చిల్లర రాజకీయాలు, బిఆర్ఎస్ ను బదనం చేసే పనులు మానుకొని, ప్రజల త్రాగునీరు, సాగునీటి సమస్యలు తీర్చితే తామే కాంగ్రెస్ నాయకులకు ఘనంగా సన్మానం చేస్తామని అన్నారు.చెప్పిన పనులన్నీ కాగితాలకే పరిమితం చేయకుండా పూర్తి చేసేలా శ్వేత పత్రం విడుదల చేయాలని, పనులన్నీ చేయకపోతే ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల్లోకి వెళ్లి వారిలో చైతన్యం తీసుకువచ్చి ప్రశ్నించేలా చేస్తామని హెచ్చరించారు.

## జిల్లా విస్తృతస్థాయి సమావేశ పోస్టర్ ఆవిష్కరణ



**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో కార్మికుల ఆధ్వర్యంలో జిల్లా విస్తృతస్థాయి సమావేశ పోస్టర్ ను మండల సీపీఐ(ఎం) కన్వీనర్ గురిజాల శ్రీధర్ బుధవారం విడుదల చేసారు.ఈ సందర్భంగా గురజాల శ్రీధర్ మాట్లాడుతూ ఈనెల 16న ఆదివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో వాగు ఒడ్డు సమీపాన అంబా భవాని ఫంక్షన్ హాల్ లో ఉదయం 11:30 నిమిషాలకు సమావేశం నిర్వహిం చడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర రథసారథి కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ విచ్చేస్తున్న సందర్భంలో ఈ జిల్లాలో ఉన్న కార్మికులు, కర్షకులు, మహిళా బీడీ కార్మికులు, ఉపాధిహామీ కూలీలు, వ్యవసాయ కూలీలు, హమాలి, భవనిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున ఈ సమావేశానికి విచ్చేసి విజయవంతం చేయాలని మండల సీపీఐ(ఎం) పక్షాన కార్మిక వర్గాలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు, రామంచ అశోక్, మరియు కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



## మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్..

**బలగం టీవీ , సిరిసిల్ల**

పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచులఅసెంబ్లీ ముట్టడి చేస్తామని హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర మాజీ సర్పంచ్ ల జేఏసీ అధ్యక్షులు సర్వీ యాదయ్య, రాష్ట్ర జేఏసీ ఉపాధ్యక్షులు మాట్లమధు, మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

# ఇండస్ట్రీకి వచ్చి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి తోడుంటా

**● నటుడు కిరణ్ అబ్బవరం**

**బలగం టీవి, హైదరాబాద్**

ఇండస్ట్రీకి వచ్చి ఇబ్బంది పడుతున్న వారికి నేను తోడుంటానని నటుడు కిరణ్ అబ్బవరం తెలిపారు. ఆయన ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం దిల్‌రుబా . ఈ సినిమాకి విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తుండగా.. రవి, జోజో, జోస్, రాకేష్ రెడ్డి నిర్మిస్తున్నారు. రుక్సర్ ధిల్లాన్ కథానాయికగా నటిస్తుండగా.. మార్చి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది చిత్రయూ నిట్. అయితే ఈ వేడుకలో కిరణ్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని కృష్ణ నగర్‌కి నేను వచ్చినప్పుడు నాతో పాటు 50 మంది ఉండేవాళ్లం. అందరం కలిసి పనిచేయాలని చెప్పి బావార్చి దగ్గర కలిసేవాళ్లం. స్టోరీలు చెప్పుకునేవాళ్లం. అయితే రోజురోజుకి మా సంఖ్య తగ్గి 50 నుంచి 10కి పడిపోయింది. ఇప్పుడయితే ఇద్దరు ముగ్గురు కూడా కనిపించట్లేదు. దీనికి కారణం ఏంటి అంటే అవకాశలు రావడం. అవకాశం వచ్చిన వాళ్ల ఇక్కడనే సెటిల్ అవుతారు. కానీ అవకాశలు రాకుండా అలానే మిగిలిపోయిన వాళ్ల ఇంటికివెళ్లి పోతున్నారు. సినిమాలు అంటే పేరెంట్స్‌కి కూడ నమ్మకం లేదు. అందుకే ఇండస్ట్రీకి వచ్చి ఇబ్బంది



పడుతున్న వారికి నేను తోడుండాలి అనుకుంటున్నాను. నేను ఇప్పుడు చిన్న హీరోనే కానీ నాకు తోచినంతా సాయం చేయడం చేస్తాను. ప్రతి సంవత్సరం సినిమా అంటే పిచ్చి ఉండే 10 మంది వ్యక్తులకు నేను ఆర్థిక సాయం చేయడమే కాకుండా ఆదుకుంటాను. కొత్త వారిని ఇండస్ట్రీలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాను. నా సినిమాలలో కూడా కొత్తవారికి అవకాశం ఇవ్వమని నిర్మాతలను అడుగుతాను. నాకంటే టాలెంట్ ఉన్నవాళ్లు చాలమంది బయట ఉన్నారు. నాకు అవకాశం వచ్చింది. మీకు రేపు అవకాశం రావచ్చంటూ కిరణ్ చెప్పుకోచ్చాడు.

ఈ సినిమాకు విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తుండగా.. రవి, జోజో, జోస్, రాకేష్ రెడ్డి నిర్మిస్తున్నారు. రుక్సర్ ధిల్లాన్ కథానాయికగా నటిస్తుండగా.. మార్చి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ వేడుకలో నిర్మాత రవి మాట్లాడుతూ.. దిల్‌రుబా సినిమాలో ఫైట్స్ అద్భుతంగా వచ్చాయని తెలిపారు. మీరు సినిమా చూసేటప్పుడు ఒకవేళ ఫైట్స్ నచ్చకుంటే నన్ను సినిమా విడుదల అనంతరం పెట్టే ప్రెస్‌మీట్‌లో చితక్కొట్టేయండని తెలిపాడు. అలాగే కిరణ్ అబ్బవరం ఫైట్స్ చూసి మీరు మెస్మరైజ్ అవ్వకపోతే నేను ఫ్యూచర్‌లో సినిమాలు చేయనంటూ నిర్మాత

# ర్యాంకింగ్స్‌లో మూడో స్థానానికి రోహిత్



**బలగం టీవి, హైదరాబాద్**

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ సత్తా చాటాడు. ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో అత్యుత్తమ ప్రదర్శనతో రెండు స్థానాలు మెరుగుపర్చుకుని 756 రేటింగ్స్‌తో మూడో స్థానానికి దూసుకొచ్చాడు. స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ (736 రేటింగ్స్) ఒక ప్లేస్ కోల్పోయి ఐదో స్థానానికి పడిపోయాడు. యంగ్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ అగ్ర స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక శ్రేయస్ అయ్యర్ (704 రేటింగ్స్) 8వ స్థానంలోనే కొనసాగుతున్నాడు.

మరోవైపు బౌలింగ్ విభాగంలో మహీశ్ తీక్షణ 680 రేటింగ్స్‌తో టాప్‌లోనే ఉండగా, మిచెల్ శాంట్నర్ (657 రేటింగ్స్) ఆరు స్థానాలు ఎగబాకి రెండో ప్లేస్‌కు దూసుకొచ్చాడు. టీమ్‌ఇండియా స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (650 రేటింగ్స్) మూడు స్థానాలు మెరుగుపర్చుకొని మూడో ప్లేస్‌లో కొనసాగుతున్నాడు. సీనియర్ రవీంద్ర జడేజా (616 రేటింగ్స్) ప్రస్తుతం 10వ స్థానంలో ఉన్నాడు.

# 'ఓపెనింగ్ స్లాట్ ఖాళీగా ఉంటే ఇవ్వండి'

**● చాహల్**

**బలగం టీవి, హైదరాబాద్**




ఇండియన్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో పంజాబ్ కింగ్స్‌లో జాయిన్ అయ్యాడు స్పిన్నర్ చాహల్. ఆ టీమ్ ప్రాక్టీస్ సెషన్‌లో బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్ కూడా సాధన చేస్తూ కనిపించాడు. లాంగ్ స్పెల్స్ వేస్తూ టచ్‌లోకి వచ్చేందుకు ప్రయత్నిస్తు న్నాడు. అలాగే బ్యాట్ కూడా పట్టి భారీ షాట్లు బాదుతున్నాడు. అలాగే ఎప్పటిలాగే జోకులు వేస్తూ ఇతర ఆటగాళ్లను నవ్వుల్లో ముంచెత్తాడు. దీనికి సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసిన చాహల్.. కోచ్ పాంటింగ్‌కు ఒక రిక్వేస్ట్ పెట్టాడు. ఓపెనింగ్ స్లాట్ ఖాళీగా ఉంటే చెప్పండి.. ఆ ప్లేస్‌లో రావడానికి సిద్ధం అని చాహల్ క్యాప్షన్ పెట్టాడు.

చాహల్ బ్యాటింగ్ వీడియోపై సీక్రెట్ వెపన్ అంటూ పంజాబ్ కింగ్స్ కూడా ఫన్నీ క్యాప్షన్ పెట్టింది. ఈ వీడియోలో చాహల్ వేసిన జోకులు హైలైట్ అనే చెప్పాలి. మీ బౌలర్లను బాదిపారేస్తా.. దొంగ బౌలర్లు.. అంటూ అతడు చేసిన వ్యాఖ్యలు నవ్వులు తెప్పిస్తున్నాయి. కాగా, ఐపీఎల్-2025కు ముందు నిర్వహించిన మెగా ఆక్షన్‌లో రూ.18 కోట్ల కళ్లుచెదిరే ధర చెల్లించి చాహల్‌ను సొంతం చేసుకుంది పంజాబ్ కింగ్స్.



# గద్దర్ అవార్డుల విధి విధానాలు ఖరారు

**● తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్‌డీసీ) చైర్మెన్, నిర్మాత దిల్ రాజు**

**బలగం టీవి, హైదరాబాద్**

గద్దర్ అవార్డులకు సంబంధించిన విధి విధానాలు ఖరారయ్యాయి అని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్‌డీసీ) చైర్మెన్, నిర్మాత దిల్ రాజు అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని గద్దర్ అవార్డులను ఇవ్వనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ అవార్డుల ప్రదానోత్సవానికి సంబంధించిన వివరాలను తెలియజేస్తూ తాజాగా దిల్ రాజు విలేకరులతో మాట్లాడారు. ఏప్రిల్ నెలలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని చెప్పారు. "గద్దర్ అవార్డులకు సంబంధించిన విధి విధానాలు ఖరారయ్యాయి. పైడి జయరాజ్, కాంతారావు పేరుతో గౌరవ పురస్కారాలు అందించనున్నాం. తెలుగుతోపాటు ఉర్దూ సినిమాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆ సినిమాకు బెస్ట్ ఫిల్మ్ అవార్డు ఇవ్వనున్నాం. 2014 జూన్ నుంచి 2023 డిసెంబర్ వరకూ విడుదలైన చిత్రాల్లో ప్రతి ఏడాది ఉత్తమ చిత్రాన్ని ఎంపిక చేసి అవార్డు ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. 2024కు సంబంధించి కొన్ని మార్పులు చేర్పులతో పాత రోజుల్లోని అవార్డుల ప్రక్రియనే కొనసాగించనున్నాం. ఏప్రిల్‌లో ఈ కార్యక్రమాన్ని వైభవంగా చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. గతంలో సింహా అవార్డుల కోసం దరఖాస్తుదారులు ఎఫ్‌డీసీకి కొంత డబ్బు పంపించినట్లు తెలిసింది. ఆ డబ్బును వారికి ఇప్పుడు తిరిగి ఇచ్చేస్తాం. సినిమా అవార్డుల విషయాన్ని వివాదం చేయొద్దు. దీనిని ప్రతి ఒక్కరూ పాజిటివ్‌గా అనుకుని విజయవంతం చేయాలి. అప్పుడే ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకోగలం" అని ఆయన కోరారు

# సౌందర్య ఆస్తులను మోహన్ బాబు స్వాధీనం చేసుకోలేదు

**● దివంగత నటి సౌందర్య భర్త రఘు**

**బలగం టీవి, హైదరాబాద్**

సినీ నటి సౌందర్య మరణం ప్రమాదవశాత్తు జరిగింది కాదని... ఆమెను పక్కాగా ప్లాన్ చేసి చంపేశారంటూ ఖమ్మం జిల్లాకు చెందిన ఒక వ్యక్తి ఇటీవల నిరసనకు దిగారు. మోహన్ బాబుపై సంచలన ఆరోపణలు చేశారు. దీనికి సంబంధించి ఫిర్యాదు కూడా చేశారు. హైదరాబాద్ జల్ పల్లిలో ఉన్న ఫామ్ హౌస్ ని కూడా తన అదుపులో ఉంచుకుని మోహన్ బాబు అనుభవిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సౌందర్య భర్త రఘు స్పందించారు. హైదరాబాద్ లోని ఒక ప్రాపర్టీ గురించి మోహన్ బాబు పేరును అనవసరంగా ప్రస్తావిస్తున్నారని రఘు చెప్పారు. ఆ వార్తలన్నీ అవాస్తవాలేనని అన్నారు. తన భార్య సౌందర్య ఆస్తులను మోహన్ బాబు చట్ట విరుద్ధంగా స్వాధీనం చేసుకోలేదని చెప్పారు. మోహన్ బాబుకు, తమకు మధ్య ఎలాంటి ఆస్తి లావాదేవీలు లేవని అన్నారు. తన భార్య, అత్త, బావమరిది ఆయనతో మంచిగా ఉండేవారని తెలిపారు. సౌందర్య మరణించిన తర్వాత కూడా... ఆయనతో తమకు మంచి స్నేహం ఉందని చెప్పారు. మోహన్ బాబుపై అసత్య వార్తలు వస్తున్న నేపథ్యంలోనే తాను అసలు విషయాలు ఏమిటో చెప్పాలనుకున్నానని తెలిపారు. ఇలాంటి తప్పుడు కథనాలను ప్రచురించవద్దని కోరారు.




# 26న ఓటీటీలోకి 'ముఫాసా ది లయన్ కింగ్'..

**బలగం టీవి, హైదరాబాద్**

'ముఫాసా: ది లయన్ కింగ్' ఓటీటీలోకి రాబోతుంది. తాజాగా ఈ సినిమా ఓటీటీ అప్‌డేట్‌ని ప్రకటించారు మేకర్స్. 'ది లయన్ కింగ్' సినిమాకు ప్రీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్ అందుకుంది. ఇక తెలుగులో ముఫాసా అనే రాజు పాత్రకు మహేశ్ బాబు డబ్బింగ్ చెప్పగా.. బాలీవుడ్ హిందీ వెర్షన్‌కి షారుఖ్ ఖాన్ డబ్బింగ్ చెప్పాడు. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో ఈ చిత్రం మార్చి 26 నుంచి తెలుగుతో పాటు ఇంగ్లీష్, హిందీ, తమిళం భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు వెల్లడించింది.


# నవనీత్ కౌర్ తల్లి అనారోగ్యంతో కన్నుమూత

**బలగం టీవి, హైదరాబాద్**

నటి నవనీత్ కౌర్ తల్లి రాజీందర్ కౌర్ హర్ భజన్ సింగ్ కన్నుమూశారు. కొన్ని రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. బుధవారం ఉదయం ఆమె హాస్పిటల్ లో చికిత్స తీసుకుంటూ తుది శ్వాస విడిచారు. 61 సంవత్సరాల రాజీందర్ కౌర్ పార్థీవ దేహాన్ని ప్రజల సందర్శనార్థం కొంతసేపు ఉంచి, ఆ తర్వాత అంత్యక్రియలను నిర్వహించారు. పలువురు రాజకీయ ప్రముఖులు నవనీత్ కౌర్ తల్లి మృతి పట్ల సంతాపం

# భారత మాజీ క్రికెటర్ సయ్యద్ అబిద్ అలీ మృతి

**బలగం టీవి, హైదరాబాద్**



భారత మాజీ క్రికెటర్ సయ్యద్ అబిద్ అలీ (83) బుధవారం కన్నుమూశారు. హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ అబిద్ అలీ బుధవారం అమెరికాలో తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన భారత్ తరపున 29 టెస్టు మ్యాచులు ఆడారు.

అబిద్ అలీ 1967-1975 మధ్య భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. తన కాలంలో మేటి ఆల్‌రౌండర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. మీడియం పేసర్‌గా.. బ్యాటర్‌గా.. మంచి ఫీల్డర్‌గా అభిమానుల మన్ననలు పొందారు. దేశవాళీ క్రికెట్‌లో హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహించారు. హైదరాబాద్ తరపున రంజీ క్రికెట్‌లో అదరగొట్టి భారత జట్టుకు ఎంపికయ్యారు. 1967లో బ్రిస్బేన్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశారు. తన అరంగేట్ర మ్యాచ్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లోనే (6/55) ఆరు వికెట్లతో సత్తా చాటారు. 1971లో ఓవల్ వేదికగా గెలిచిన చారిత్రాత్మక టెస్ట్‌లో భారత జట్టు విజయ లాంఛనాన్ని అబిద్ అలీనే పూర్తి చేశారు. 1974లో వన్డేల్లోకి అరంగేట్రం చేసిన అబిద్ అలీ.. 1975 ప్రపంచకప్ ఆడి జట్టులోనూ ఉన్నారు. తన కెరీర్‌లో మొత్తం 29 టెస్ట్‌లు ఆడి 47 వికెట్లతో పాటు 1018 పరుగులు చేశారు. 32 క్యాచ్‌లు అందుకున్నారు. ఐదు వన్డేలు ఆడి 7 వికెట్లు తీయడంతో పాటు 93 పరుగులు చేశారు.

అబిద్ అలీ మృతికి బీసీసీఐతో పాటు మాజీ క్రికెటర్లు సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించారు. హెచ్‌సీఏ సైతం అబిద్ అలీకి నివాళులర్పించింది. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు ఎక్స్‌వేదికగా అబిద్ అలీ అకాల మృతికి సంతాపం ప్రకటించారు. ప్రముఖ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్, టీమిండియా మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్, మాజీ మంత్రి కేటీఆర్ సైతం అబిద్ అలీకి నివాళులర్పించారు.